పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సిగా పోటీ చేయుచున్న పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఈదులగూడెం, అమ్మవారిగూడెం, చొప్పరమెట్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ముత్యాల నరేష్, స్టాలిన్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అసెంబ్లీలో గళమెత్తేనా..!

- పోలవరం నిర్వాసితులకు అరకొర పరిహారం
- కౌలురైతుల చట్టం కార్యరూపం దాల్చేనా
- పడకేసిన డెల్టా ఆధునికీకరణ
- ఆక్వా, వరి రైతులకు ప్రోత్సాహకాలు కరువు
- కొల్లేరు సమస్యలు లేవనెత్తేనా
- నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా ప్రజానీకం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అసెంబ్లీలో ఎంఎల్‌ఎలు గళమెత్తుతారా.. లేక మౌనం వహిస్తారా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తిస్థాయిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనైనా జిల్లాలోని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా అని జనం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 80 శాతం ప్రజానీకానికి వ్యవసాయమే జీవనాధారం. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో విసుగెత్తిన జనం గడిచిన ఎన్నికల్లో రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా అన్నింటిలోనూ కూటమి అభ్యర్థులనే జనం గెలిపించారు. తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. జూన్‌లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం 2024 నవంబర్ 11న మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. తక్కువ వ్యవధిలో బడ్జెట్ ప్రవేశ పెట్టడంతో జనం సైతం పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. ఈసారి 2025-26 పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. జిల్లాలో పోలవరం నిర్వాసితుల సమస్య అత్యంత ప్రధానమైంది. ఐదేళ్ల పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీ కింద ప్రభుత్వం జిల్లాలోని నిర్వాసితులకు రూ.250 కోట్లు వరకూ జమ చేసింది. పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలు కాకుండా రూ.6.25 లక్షల చొప్పున మాత్రమే జమ చేసింది. 2017 తర్వాత 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇవ్వలేదు. ఇంటికి సంబంధించిన పరిహారం సొమ్ము అందలేదు. కాలనీల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగలేదు. నిర్వాసితులకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయని, గ్రామసభలు నిర్వహించాలని డిఆర్‌సి సమావేశంలో పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు ప్రస్తావించిన సంగతి తెలిసిందే. పోలవరం నిర్వాసితుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి నిర్వాసితులకు న్యాయం జరిగేలా జిల్లాకు చెందిన ఎంఎల్‌ఎలు ఏం చేస్తారో వేచిచూడాలి.

కౌలుచట్టంపై గళమెత్తేనా..?

రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయసాగులో 70 శాతం వీరే సాగు చేస్తున్నారు. ప్రభుత్వం అందించే ఏ ఒక్క సాయమూ కౌలురైతులకు అందడం లేదు. దీంతో కౌలురైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయి. తాము అధికారంలోకి వస్తే కౌలురైతుల చట్టంలో మార్పులు చేసి న్యాయం చేస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తెలిపారు. తొలుత హడావుడి సైతం చేశారు. ఇప్పుడు నోరుమెదపడం లేదు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనైనా కౌలుచట్టం కార్యరూపం దాల్చేనా అంటూ జిల్లాలోని కౌలురైతులు ఎదురుచూస్తున్నారు. అలాగే ధాన్యానికి బోనస్ ఇస్తే వరి రైతులకు ఊరట దక్కుతుంది. ఆక్వా రైతులకు మేత ధరల విషయంలో సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సాహకాలు అందించాలని రైతులు కోరుకుంటున్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపైనా ఎంఎల్‌ఎలు అసెంబ్లీలో ప్రస్తావించాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిపై మాట్లాడుతారా?

జిల్లాలో ప్రధానంగా సాగునీటికి సంబంధించి డెల్టాలో ఆధునికీకరణ పనులు జరగాల్సి ఉంది. గత ప్రభుత్వం ఆధునికీకరణపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. కూటమి ప్రభుత్వం అదేవిధంగా వ్యవహరిస్తోంది. వేసవి దగ్గరపడినా ఇప్పటి వరకూ డెల్టా ఆధునికీకరణ పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు. ఈ ఏడాదైనా పనులు జరుగుతాయో, లేదో అనుమానం నెలకొంది. అసెంబ్లీలో ఎంఎల్‌ఎలు దీనిపై మాట్లాడాల్సి ఉందని జిల్లాలోని రైతులు కోరుతున్నారు. మెట్ట ప్రాంతంలో చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాల పరిస్థితి అదేవిధంగా ఉంది.

కొల్లేరు సమస్యలు లేవనెత్తేనా?

రెండు జిల్లాల్లో మరో ప్రధానమైన సమస్య కొల్లేరు. సముద్రపు నీరు కొల్లేరులోకి రాకుండా మూడుచోట్ల రెగ్యులేటర్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. గత వైసిపి ప్రభుత్వం నిధులు కేటాయించినా పనులు ముందుకు సాగలేదు. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు. కొల్లేరులో చేపల చెరువులను అధికారులు మళ్లీ ధ్వంసం చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొల్లేరును మూడోకాంటూరుకు కుదించడంతోపాటు, కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. అయితే ఎకోసెన్సిటివ్ జోన్ పేరుతో జనం మరింత ఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీలో కొల్లేరు సమస్యలను లేవనెత్తి తమకు అండగా నిలబడాలని అక్కడి జనం కోరుతున్నారు.

పరీక్షా కేంద్రం వద్ద బారులు తీరిన అభ్యర్థులు

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా కేంద్రమైన ఏలూరులో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షల నిర్వహణకు ఆరు కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారని తెలిపారు. వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, సిఆర్‌రెడ్డి మహిళా కళాశాల, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఉదయం పూట జరిగిన పరీక్షకు మొత్తం 4,415 మంది అభ్యర్థులకు 3,881 మంది (87.90 శాతం) హాజరవ్వగా, 534 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు మొత్తం 4,415 మంది అభ్యర్థులకుగాను 3,878 మంది (87.81 శాతం) అభ్యర్థులు హాజరవ్వగా 537 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అయితే అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 8.45 నిమిషాలకు గేట్లు తెరిచి అభ్యర్థులను లోపలికి అనుమతించినప్పటికీ 9.15 వరకు అభ్యర్థుల రాక మందకొడిగా సాగింది. ఆ తర్వాత అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఒక సిఐ స్థాయి అధికారి, ఇద్దరు ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని పరీక్షా కేంద్రాలను సందర్శించిన డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రతి కేంద్రం వద్దా అభ్యర్థులను గేటు బయట క్షుణ్ణంగా తనిఖీ చేసి, అనంతరం లోపల కూడా మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి గదుల్లోకి అనుమతించారు. జిల్లా కలెక్టర్ వెంట ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ ఉన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

పరీక్షా కేంద్రంలో కలెక్టర్ వెట్రిసెల్వి తనిఖీలు

అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

ఎంఎల్‌సి ఎన్నికల్లో..

టిడిపికి పిడిఎఫ్ గుబులు..!

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ టిడిపికి పిడిఎఫ్ గుబులు పట్టుకుంది. అధికార పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి సిఎం నుంచి గ్రామస్థాయి నేతలంతా కలిసి సర్వశక్తులూ ఒడ్డుతున్నప్పటికీ ఎన్నికల భయం మాత్రం ఆ పార్టీ నేతలను వెంటాడుతోంది. అందుకు ప్రధాన కారణం ఎన్నికల బరిలో పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులు నువ్వా.. నేనా అన్నట్లు ముందువరుసలో నిలవడమే.

- చాప కింద నీరులా పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు ప్రచారం
- పిడిఎఫ్‌కు అండగా ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రజాసంఘాలు
- ప్రచారంలో సర్వశక్తులు ఒడ్డుతున్న అధికార పార్టీ
- ఊదరగొడుతున్న ఆడియో ఫోన్‌కాల్స్
- ఎన్నిచేసినా అధికార పార్టీని వెంటాడుతున్న ఎన్నికల గుబులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల పరిధిలో 3.14 లక్షల మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారు. ఇప్పటి వరకూ ఉభయగోదావరి జిల్లాల్లో మూడుసార్లు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు జరగ్గా రెండు సార్లు పిడిఎఫ్ అభ్యర్థులే గెలిచారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో మూడుసార్లు పిడిఎఫ్ అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. ప్రస్తుతం జరుగుతున్న పట్టభద్రుల ఎన్నికల్లోనూ పిడిఎఫ్ అదే తరహాలో ముందుకు సాగుతోంది. ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రజాసంఘాలు పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా నిలిచి ప్రచారం చేస్తున్నారు. చాపకింద నీరులా పిడిఎఫ్ తన ప్రచారాన్ని సాగిస్తున్న తీరు అధికారపార్టీలో గుబులు రేపుతోంది. ఓటర్ల నుంచి మంచి స్పందన వస్తుండడంతో పిడిఎఫ్ మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతోంది. విద్యావంతులైన గ్రాడ్యుయేట్ ఓటర్ల నుంచి పిడిఎఫ్ అభ్యర్థికి వస్తున్న స్పందన టిడిపి, కూటమి నేతల్లో వణుకు పుట్టిస్తోంది. దీంతో ప్రతి 30 మంది ఓటర్లకు ఒక్కో నాయకుడిని నియమించి అధికార పార్టీ ప్రచారం సాగించడంతోపాటు దగ్గరుండి ఓట్లు వేయించేలా ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. ఇతర ప్రాంతాల్లోని ఓటర్లను ఆకట్టుకునేందుకు సైతం రకరకాల జిమ్మిక్కులు ప్రయోగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఫోన్లు చేసి ఎవరికి ఓటు వేస్తారంటూ ఓటర్ల నిర్ణయం ముందుగానే తెలుసుకునే ప్రయత్నం అధికార పార్టీ చేస్తోంది. రహస్య బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో ముందుగా ఓటు ఎవరికి వేసేది చెప్పమని ఎలా అడుగుతారని ఫోన్లు చేసిన వారిపై ఓటర్లు మండిపడుతున్నారు. తమకు ఇచ్చిన ప్రాజెక్టు ఇదంటూ చెబుతున్న తీరు చూస్తే ఎంఎల్‌సి ఎన్నికలపై టిడిపి ఏవిధంగా భయపడుతుందో అర్థం చేసుకోవచ్చు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచార గడువు ముగియనుంది. 27వ తేదీ పోలింగ్ జరగనుంది. సమయం దగ్గరపడుతున్న కొద్దీ టిడిపి, కూటమి నేతలను ఎన్నికల భయం వెంటాడుతోంది. ఇంత టెన్షన్ ఎప్పుడూ చూడలేదని టిడిపి, కూటమి నేతలే చెబుతుండటం గమనార్హం.

శాసనమండలిలో సామాన్యుల గొంతు వినిపించే వారికే ఓటు

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటింగ్‌పై ఓటర్లలో తీవ్ర చర్చ నడుస్తోంది. టిడిపి అభ్యర్థి గెలిస్తే శాసనమండలిలో ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడతారే తప్ప ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై మాట్లాడే పరిస్థితి ఉండదనే అభిప్రాయం అందరిలోనూ నెలకొంది. పిడిఎఫ్ అభ్యర్థి గెలిస్తే సామాన్యుల సమస్యలపై శాసన మండలిలో ప్రశ్నించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. గతంలో గెలిచిన పిడిఎఫ్ అభ్యర్థులు శాసనమండలిలో లేవనెత్తిన అంశాలను, సమస్యలపై ఆందోళనలు చేసినప్పుడు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మద్దతుగా నిలిచిన ఘటనలను ఉద్యోగులు, నిరుద్యోగులు గుర్తు చేసుకుంటున్నారు. దీంతో ఎన్నికలు దగ్గరపడే కొద్దీ పిడిఎఫ్ అభ్యర్థి గురించి ఓటర్లలో ఎక్కువ చర్చ నడుస్తోంది. ఇది అధికార పార్టీ నేతల్లో గుబులు రేపుతోంది.

'కంప్యూటర్ విజ్ఞానం ప్రాధాన్యత గుర్తించాలి'

ప్రజాశక్తి - ఏలూరు

కంప్యూటర్ విజ్ఞానం ప్రాధాన్యత గుర్తించి ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణను అంతా వినియోగించుకోవాలని హేలాపురి బాలోత్సవం ఛైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల అన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ కేంద్రానికి సర్ సిఆర్‌రెడ్డి మహిళా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ సి.అరుణకుమారి అందజేసిన రెండు కంప్యూటర్‌ల స్వీకరణ సభ ఆదివారం విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షతన జరిగింది. తొలుత అడుసుమిల్లి నిర్మల, విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు రెండు కంప్యూటర్లను స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ అనేకమంది సహాయ సహకారాలతో నడుస్తున్న కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో కేవలం రూ.500 ఫీజుతోనే ఉపాధికి తోడ్పాటునిస్తోందన్నారు. ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంఎస్ఎన్.లక్ష్మి ప్రిన్సిపల్‌గా ఈ కేంద్రంలో ఎంఎస్ ఆఫీస్, డిటిపి, ఫొటోషాప్, టాలీ కోర్సులు నేర్పుతున్నారన్నారు. ఈ శిక్షణను ఎక్కువ మంది వినియోగించుకోవాలని కోరారు. విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ ఎనిమిదో తరగతి, ఆపైన చదువుతున్న విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, గృహిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండు కంప్యూటర్లు శిక్షణ కేంద్రానికి అందజేసిన అరుణకుమారికి కృతజ్ఞతలు తెలిపారు. హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పివి.రమణ, కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ ఎంఎస్ఎన్.లక్ష్మి మాట్లాడారు.

మాట్లాడుతున్న అడుసుమిల్లి నిర్మల

జిబిఎస్‌పై ఆందోళన వద్దు

డిఎంహెచ్ఒ ఆర్.మాలిని

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిబిఎస్ (గులియన్ బారో సిండ్రోమ్) విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఒ) ఆర్.మాలిని అన్నారు. జిబిఎస్ వ్యాప్తి విస్తృతమవుతున్న నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలు, బర్డ్‌ఫ్లూ, సిబ్బంది కొరత తదితర అంశాలపై ప్రజాశక్తి ముఖాముఖిలో ఆమె వివరించారు.

ప్రశ్న: జిబిఎస్ అంటే ఏమిటి?

జిబిఎస్ అంటే గులియన్ బారో సిండ్రోమ్. ఇవి ముగ్గురు ఫ్రెంచ్ శాస్త్రవేత్తల పేర్లు. ఇది బ్యాక్టీరియా లేదా వైరస్ కారణంగా వచ్చే ఆటో ఇమ్యూన్ డిసీజ్. ఇది నరాల వ్యవస్థపై దాడి చేస్తుంది. అంటువ్యాధి కాదు. 1916లోనే ఈ వ్యాధిని కనుగొన్నారు. అయితే మరణం రాకుండా చికిత్సలు మాత్రం 30-40 సంవత్సరాల్లోపే వచ్చాయి. ఇది పాదాల నుంచి క్రమేపీ పైకి మెదడు వరకు పాకే న్యూరాలజికల్ డిజార్డర్.

ప్రశ్న: జిబిఎస్ లక్షణాలేమిటి?

చేతులు, కాళ్లల్లో తిమ్మిర్లు, బలహీనత, జ్వరం, వాంతులు, డయేరియా, పొత్తికడుపు నొప్పి, నీరసం, కండరాల బలహీనత వంటి లక్షణాలు కన్పిస్తాయి.

ప్రశ్న: జిబిఎస్‌కు ఎటువంటి చికిత్స చేస్తారు?

రోగి రక్తంలో ఇమ్యూనిటీ తగ్గిన లక్షణాలు ఉంటాయి. కాబట్టి రక్తం మొత్తం ఫిల్టర్ చేసి కొత్త రక్త కణాలు జనించడానికి డయాలసిస్ చేస్తారు. ఇది 5-6 రోజులు చేస్తే కొత్త రక్తం పుట్టి, ఉన్న రక్తం శుద్ధి అయ్యి వ్యాధి తగ్గుతుంది. ఇదంతా జరగాలంటే రోగి వయస్సు, ఇతర జబ్బులు ఏమీ లేకపోవడం, జనరల్ హెల్త్ బాగుండటం వంటివి ఉపకరిస్తాయి. రోగి రెండు, మూడు వారాల్లోనే కోలుకుని బయటపడతారు.

ప్రశ్న: ఏలూరు జిల్లాలో జిబిఎస్ కేసులు ఏమైనా నమోదయ్యాయా?

ఇప్పటివరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఇటీవల ఒక మహిళకు జ్వరం వచ్చి కండరాల బలహీనత ఉండటం వల్ల ఆ వ్యాధి ఏమో అని అనుమానం వచ్చి శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించాం. అయితే అది నెగిటివ్ రిపోర్ట్ వచ్చింది.

ప్రశ్న: జిబిఎస్ సోకకుండా ఉండాలంటే ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జీర్ణ వ్యవస్థలో ఉండే బ్యాక్టీరియా వల్ల జిబిఎస్ వ్యాపిస్తుంది. కాబట్టి వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత వంటివి తప్పకుండా పాటించాలి. ఆహారం తీసుకునే ముందు చేతులు కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే సరిపోతుంది. బయట దొరికే జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. మంచినీరు కూడా కాచి చల్లార్చిన తర్వాత తాగితే ఎటువంటి జీర్ణ సంబంధిత వ్యాధులూ రావు.

ప్రశ్న: బర్డ్‌ఫ్లూ అంటే ఏమిటి?

బర్డ్ ఫ్లూ కోళ్లు, బాతులు ఇతర పక్షి జాతులకు ఒకదాని నుంచి ఒకదానికి త్వరగా వ్యాపిస్తుంది. హెచ్5ఎన్1 అనే వైరస్ వల్ల ఇది వ్యాప్తి చెందుతుంది.

ప్రశ్న: బర్డ్‌ఫ్లూ సోకిన చికెన్ తింటే మనుషులకు కూడా వస్తుందా?

చికెన్‌ను 70 నుంచి వంద డిగ్రీలపైన ఉడికించుకుని తింటే ఎటువంటి ఇబ్బందీ ఉండదు. ఆ ఉష్ణోగ్రతలో ఈ వైరస్ చనిపోతుంది. కాబట్టి మనుషులకు వచ్చే అవకాశం లేదు.

ప్రశ్న: పిహెచ్‌సిల్లో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

పిహెచ్‌సిల్లో సిబ్బంది కొరత ఏమీ లేదు. ఒకవేళ ఎవరైనా సెలవు పెట్టి వెళ్లినప్పుడు ఇద్దరు డాక్టర్లు ఉన్న దగ్గర ఒకరిని పంపించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నాం.

ప్రశ్న: ప్రసూతి హాస్పిటల్స్‌లో కాన్పులు ఎక్కువగా ఆపరేషన్ ద్వారా జరుగుతున్నాయని అంటున్నారు? వాటిని నియంత్రించడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

కాన్పులు ఆపరేషన్ ద్వారా చేసే హాస్పిటల్స్‌కు నోటీసులిచ్చాం. అన్ని హాస్పిటల్స్‌కు షోకాజ్ నోటీసులిచ్చి కొంతమందికి సీజ్ చేస్తామని చెప్పాం. గతంలో జరిగిన ఆపరేషన్స్ కన్నా రాబోవు రోజుల్లో తగ్గుదల చూపిస్తామని హాస్పటల్స్ వారు తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

కాటి కాపరుల సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్‌ఎ బాలరాజుకు వినతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కాటి కాపరుల సమస్యలు పరిష్కరించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, కాటికాపర్ల సంఘ ఆధ్వర్యాన పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజును కోరారు. ఆదివారం బర్రింకలపాడులోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ బాలరాజును కలిసి వినతిపత్రం అందించినట్లు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ తెలిపారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కాటికాపరులుగా పని చేస్తున్నవారున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్‌ఎను కోరామన్నారు. కాటి కాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య బీమా కల్పించాలని, పిల్లలకు ఉచిత విద్య అందించాలని. పని చేయలేని వృద్ధులకు రూ.8 వేలు పెన్షన్ అందించేలా చూడాలని ఎంఎల్‌ఎను కోరినట్లు తెలిపారు. ఈ అంశాలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎంఎల్‌ఎ హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కాటికాపరుల సంఘం నాయకులు అమిర్ల వెంకటేశ్వరరావు, కొల్లి సుబ్బారావు, తగరం దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపీకి వినతి అందిస్తున్న నేతలు, కాటికాపర్లు

పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ హామీ ఇచ్చారు. పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగారంలో గ్రేడింగ్ పేరుతో రైతులు తెచ్చిన ఆయిల్‌పామ్ గెలల ఏరివేత ఆపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యాన నేతలు, ఆయిల్‌పామ్ రైతులు ఎంపీ మహేష్‌కుమార్‌ను ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గెలలు ఏరివేయడం వల్ల తాము ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఎంపీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పెదవేగిలో కొత్త ఆయిల్‌ఫెడ్ కర్మాగారం నిర్మాణానికి అవసరమైన నిధులు ప్రభుత్వ నుంచి మంజూరు చేయించాలని రైతులు ఎంపీకి విన్నవించారు. గెలల ఏరివేతను ఆపించడంతోపాటు అత్యాధునిక టెక్నాలజీతో పెదవేగిలో నూతన ఫ్యాక్టరీ ఏర్పాటుకు చొరవ చూపాలని రైతులు కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఎంపీకి వినతి అందిస్తున్న నేతలు, రైతులు

రైతుల విశిష్ట సంఖ్య నమోదు వేగవంతం చేయాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ భాషా

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతులకు విశిష్ట సంఖ్య నమోదు వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ బాష సూచించారు. మండలంలోని టి.నరసాపురం 2, బొర్రంపాలెం రైతు సేవా కేంద్రాలను ఆదివారం సందర్శించి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని రైతులందరూ రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు. విశిష్ట సంఖ్య నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే పిఎం కిసాన్‌తో పాటు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఆయన తెలిపారు. ఈ నెలాఖరులోపు విశిష్ట సంఖ్య నమోదు పూర్తి చేయాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి బి.సుమలత, వ్యవసాయ, ఉద్యానవనం సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి హబీబ్ భాషా

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి - నిడమర్రు

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా చెత్త సేకరణపై మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. చెత్తసేకరణలో భాగంగా ఇంటింటికి వచ్చు పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను విడివిడిగా అందజేయాలని, ఈవిధంగా వేరు చేసిన చెత్తను ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ వద్ద వర్మి కంపోస్ట్‌గా తయారు చేస్తారని పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రత్నకుమార్ దంపతులను సత్కరిస్తున్న లయన్స్ సభ్యులు

లయన్స్ సేవా కార్యక్రమాలపై విశ్లేషణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

లయన్స్ జిల్లా రీజియన్-2 సమావేశం ఆదివారం చొదిమెళ్లలోని బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రీజియన్ ఛైర్పర్సన్ వి.రత్నకుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ జిల్లా 316బి పూర్వ గవర్నర్ బాదం బాలకృష్ణ, 316జి జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, జిల్లా ప్రథమ వైస్ గవర్నర్ ఎన్‌వివిఎస్.పాపారావు, జిల్లా ద్వితీయ వైస్ గవర్నర్ డాక్టర్ డి.సుబ్బారావు, జిల్లా పూర్వ గవర్నర్లు, జోన్ ఛైర్మన్లు విచ్చేస్తున్న సందర్భంగా అధిక సంఖ్యలో లయన్స్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో లయన్స్ పెద్దలు రీజియన్‌లోని 17 క్లబ్‌ల సేవా కార్యక్రమాలు, సభ్యత్వ స్థితిగతులు తదితర అంశాలపై చర్చించారు. క్లబ్‌లు చేసిన వివిధ సేవా కార్యక్రమాల బ్యానర్ ప్రజెంటేషన్ చేశారు. క్లబ్బులు, వాటి పనితీరు, అవి చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పథంతో, సేవ చేయాలనే ఉద్దేశంతో ఎక్కడ ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ పేదలకు భరోసాగా అటూరి చారిటబుల్ ట్రస్ట్ నిలుస్తుంది. మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల చెరుకు ధర్మయ్య పూరిల్లు దగ్ధం కావడంతో అధినేత అటూరి వెంకట రవీంద్ర ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. వంట సామాన్లు, బట్టలు, బియ్యం, 25 కేజీల ప్యాకెట్, రూ.10 వేల నగదు ట్రస్ట్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు మనం ఘంటేశ్వరావు, తుమ్మల నాగేశ్వరావు, గరిక ముక్కు నాని, రాంబాబు, వంశీ పాల్గొన్నారు.

రైతులందరూ విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని రైతులందరూ తమ పొలం ఉన్న గ్రామ రెవెన్యూ పరిధిలో, రైతు సేవా కేంద్రం వద్ద, ఆర్‌ఎస్‌కె ఇంచార్జ్ ద్వారా విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని చింతలపూడి మండల అగ్రికల్చర్ ఎం.మీనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం రైతులందరూ తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ నెంబర్‌కి లింకైన ఫోన్ నెంబరు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని, చేయించుకోకపోతే ఏవిధమైన ప్రభుత్వ పథకాలు వ్యవసాయ మండల పరికరాలు, జీలుగులు, జనుము, పిల్లిపెసర, విత్తనాలు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలకు అర్హత రాదని తెలిపారు. రైతులందరి తరఫున మీ గ్రామంలో ఆర్‌ఎస్‌కె కేంద్రాలను సంప్రదించి విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని తెలిపారు.

జీలుగుమిల్లి : మండల పరిధిలో భూములు గల రైతులందరూ ఆయా రైతు సేవాకేంద్రాల పరిధిలో తప్పనిసరిగా విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం భూమి గల రైతులందరూ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ నెంబర్‌కి లింకైన ఫోన్ నెంబరుతో రైతు సేవా కేంద్రాల వద్ద తప్పనిసరిగా విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని అన్నారు.


రోగులను పరామర్శిస్తున్న ఎంఎల్ఏ బాలరాజు

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి.బాలరాజు పేర్కొన్నారు. ఆదివారం జీలుగుమిల్లిలో త్రినేత్ర మల్టీ స్పెషాలిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి కార్పొరేట్ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. మెడికల్ క్యాంపుకు వచ్చిన ప్రజలకు పలు రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పి.రాము, ఎంపిటిసి నాళి శ్రీను, ప్రసాద్, మధు, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని దేవుడు మాన్యానికి చెందిన దొడ్డి సాయి రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుబ్బల మంగమ్మ గుడి దర్శనానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా దొరమామిడి సమీపంలో బైక్ అదుపుతప్పి స్తంభానికి తగిలింది. సాయి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కోడి పందేలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం టి.నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురం గ్రామ శివార్లలో కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారంతో తన సిబ్బందితో ఆదివారం దాడి చేసి నిర్వాహకుల నుంచి రూ.13 వేల నగదు, కోడి పుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గుప్పెడంత గుండెకు.. కొండంత భరోసా స్టెమీ

'గోల్డెన్ అవర్'తో తప్పనున్న ముప్పు

అన్ని ప్రభుత్వాసుపత్రుల్లోనూ అందుబాటులో ఖరీదైన ఇంజక్షన్

బాధితుడికి ఇంజక్షన్ చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - చింతలపూడి

గుండెల్లో నొప్పి అనిపించినప్పుడు తక్షణమే వైద్య సాయం అందక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ పరిస్థితి మరొకరికి రాకూడదని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో తక్షణ ప్రథమ చికిత్స అందించాలనే లక్ష్యంతో స్టెమీ పేరిట అత్యవసర వైద్యం అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా చింతలపూడి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్, జంగారెడ్డిగూడెం ప్రభుత్వ హాస్పిటల్‌లో 20 మంది ప్రాణాలను కాపాడారు. గుండెనొప్పి వచ్చిన వారికి తొలిగంట(గోల్డెన్ అవర్) కీలకమని వైద్యులు చెబుతున్నారు. ఛాతిలో నొప్పి, ఎడమ భుజం లాగటం, గుండెదడ దడ, ఆకస్మిక ఆయాసం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే ఆసుపత్రికి రావాలని సూచిస్తున్నారు. వస్తే ప్రభుత్వం సరఫరా చేసిన రూ.45 వేల ఖరీదైన టెనెక్ట్ ప్లజ్ ఇంజక్షన్ ఉచితంగా వేస్తారు. ఇది రక్తం గడ్డకట్టకుండా చేస్తుంది. ఇంజక్షన్ వల్ల రోగికి మెరుగైన వైద్యం అందించడానికి తగిన సమయం లభిస్తుంది. చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చాట్రాయి, కోటపాడు, తెలంగాణ, కృష్ణ, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చి ఈ ఇంజక్షన్ ఉపయోగించుకుంటున్నారు. సకాలంలో వారికి ఫస్ట్ ఎయిడ్ చేసి, ఇసిజి తీసి, నిర్ధారణకు వచ్చాక ఇంజక్షన్ చేస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ ఇంజక్షన్ గురించి గ్రామాలలో తెలియక చాలా మంది మృత్యువాత పడుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రూ.45 వేల ఖరీదైన టెనెక్ట్ ప్లజ్ ఇంజక్షన్ వేసిన తరువాత రోగి ప్రాణాలు కాపాడటానికి వైద్యులకు తగినంత సమయం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ప్రతి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నాం

నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్

ప్రతి గ్రామంలో టెనెక్ట్ ప్లజ్ ఇంజక్షన్ గురించి అవగాహన కల్పిస్తున్నాము. రూ.45 వేలు విలువ గల ఇంజక్షన్ ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడాము. జంగారెడ్డిగూడెం, చింతలపూడి ఆసుపత్రుల్లో ఇప్పటి వరకు 20 వరకు ఈ ఇంజక్షన్ ద్వారా ప్రాణాలు కాపాడాము. గ్రామాలలో దీనిపై ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా అవగాహన కల్పించాలి. ప్రతి గ్రామంలోకి ఈ ఇంజక్షన్ గురించి తెలియజేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. ప్రతిచోట బ్రోచర్స్ పెట్టేవిధంగా, ఆర్‌ఎంపి డాక్టర్స్, హోటల్స్ వద్ద పెట్టే విధంగా ఆదేశాలు ఇచ్చాము. ఏ ఒక్క ప్రాణం పోకూడదు. ప్రతి ఒక్కరూ ఈ ఇంజక్షన్ సద్వినియోగం చేసుకోవాలి.

15 మంది ప్రాణాలు కాపాడాము

కొండ్రు దేవా, భారతి, చింతలపూడి ఏరియా కమ్యూనిటీ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు

రూ.45 వేలు ఖరీదైన టెనెక్ట్ ప్లజ్ ఇంజక్షన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 15 మందికిపైగా ప్రాణాలు కాపాడాము. గ్రామంలో కూడా దీనిపై అవగాహన కల్పిస్తున్నాము. కూటమి ప్రభుత్వం రోగులకు అందిస్తున్న వరం ఈ ఇంజక్షన్.

మహిళలకు అండగా అభయ రక్షక దళం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జిల్లా ఎస్పి ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళా ఎస్ఐ కాంతిప్రియ, సిబ్బంది, మహిళలు, బాలికలు, వృద్ధుల రక్షణ కోసం అభయ రక్షక దళ సభ్యులతో కలిసి విస్తృత అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నూజివీడులో ఉన్న అన్ని పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి, అభయ రక్షక దళ సభ్యులు జిల్లావ్యాప్తంగా గస్తీ నిర్వహిస్తున్నారు. వారు ప్రజలకు సైబర్ నేరాలు, మహిళలపై ఆకతాయిల వేధింపులు, ఇతర భద్రతా సమస్యల గురించి అవగాహన కల్పిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా అభయ వాహనం ద్వారా ప్రజలకు దృశ్యరూపంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, మహిళల భద్రతకు అవసరమైన సూచనలు, ఆత్మరక్షణ పద్ధతులపై మార్గదర్శనం అందిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా మహిళలు, బాలికలు తమ భద్రతకు సంబంధించిన సమాచారం పొందుతూ అజాగ్రత్తగా ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునే అవకాశం కలుగుతోంది. సమాజంలో మహిళలపై జరిగే నేరాలను తగ్గించేందుకు, ప్రజల్లో భద్రతాపరమైన చైతన్యాన్ని పెంపొందించేందుకు ఈ అవగాహనా కార్యక్రమాలు ఉపయోగపడుతున్నాయి.

ప్రజలకు లభించే అత్యవసర సేవల సమాచారం

1. టోల్ ఫ్రీ నెంబర్ : 112
2. సైబర్ నేరాల నివారణ కోసం : 1930
3. బాల్య వివాహాల నివారణ కోసం: 1098
4. జిల్లాలో వాట్సాప్ హెల్ప్‌లైన్ నెంబర్ : 9550351100

ప్రజలు ఈ సేవలను వినియోగించుకొని, తమ భద్రత కోసం అప్రమత్తంగా ఉండాలని అభయ రక్షక దళ సభ్యులు సూచిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన

పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అభయ టీమ్

మాట్లాడుతున్న ఎంపీ మహేష్ కుమార్

మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

ఆరోగ్యమే మహాభాగ్యమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలోని ఫైర్ స్టేషన్ వద్ద మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్, అండ్ మెన్స్ ఫిజిక్స్ 2025 పోటీలు ఏలూరు ఎంపీతో కలిసి ప్రారంభించారు. డిఎఫ్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా మొదలయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ అనేది అంత తేలిక కాదు అని, తీరైన రూపం రావాలి అంటే ఏళ్లకొద్ది కఠోరంగా శ్రమించాల్సిందేనని అన్నారు. ఆహారం, శిక్షణ కోసం భారీగా వెచ్చించాలని, ప్రోటీన్లు సప్లిమెంట్‌లో ఉన్న ఆహారం తీసుకోవడానికి రోజూ ఖర్చు పెట్టాలని తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో మొదటిసారిగా నేను ఎంఎల్ఎగా ఉన్న సమయంలో ఈ పోటీ నిర్వహించడం గర్వంగా ఉందని రోషన్ తెలిపారు. చింతలపూడిలో ఈ పోటీలు నిర్వహించాలని కోచ్ దిలిప్ సంప్రదించగా తనకే అన్ని విధాలుగా సపోర్ట్ చేశానని, అలాంటి పోటీలు మెట్ట ప్రాంతంలో పెట్టడం అభినందనీయమని తెలిపారు. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నవోదయ 2.0పై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమాన్ని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ అవులయ్య ఆధ్వర్యాన నిర్వహించారు. ఇందులో భాగంగా నాటు సారాయి, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించడం వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. నిషేదిత నాటుసారా సేవించినా, కలిగి వున్నా, విక్రయించినా నేరమని వేల్పుచెర్ల గ్రామ ప్రజలకు తెలియజేశారు.

జెస్సీ రాజ్‌కు అభినందన

ప్రజాశక్తి - దెందులూరు

అంతర్జాతీయ స్కేటింగ్‌లో బంగారు పతకం విజేత జెస్సీరాజ్‌ను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందించారు. ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీ రాజ్ తన తల్లిదండ్రులతో పాటు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్కేటింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తాను సాధించిన విజయాలను జెస్సీరాజ్ ఎంపీ మహేష్ కుమార్‌కు వివరించారు. ఒలంపిక్స్‌లో బంగారు పతకం సాధించడమే తన జీవితాశయం అని జెస్సీరాజ్ తన అభిలాషను ఎంపీ మహేష్ కుమార్ వద్ద వెళ్లిబుచ్చారు. దెందులూరు నియోజకవర్గం జోగన్నపాలెంకు చెందిన 14 ఏళ్ల వయసులోనే స్కేటింగ్‌లో అసాధారణ ప్రతిభ చాటుతున్న జెస్సీరాజ్‌ను ఎంపీ మహేష్ కుమార్ మనస్ఫూర్తిగా అభినందించారు. న్యూజిలాండ్‌లో జరిగిన వరల్డ్ స్కేట్ ఓషియానియా పసిఫిక్ కప్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం కైవసం చేసుకొని, ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్న జెస్సీ రాజ్ ఏలూరు జిల్లాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చారని ఎంపీ కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి ఉన్నతికి చేరుకోవాలని ఎంపీ దీవించారు. తన వంతు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానని జెస్సీ రాజ్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలిసేందుకు ఏర్పాట్లు చేస్తానని ఎంపీ మహేష్ కుమార్ హామీ ఇచ్చారు.

ఎంపీ మహేష్‌తో జెస్సీరాజ్ కుటుంబ సభ్యులు

న్యాయవాది కృష్ణ సేవలు అభినందనీయం

15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ

నూజివీడు టౌన్ : మండలంలోని తుక్కులూరు గ్రామ పరిధిలోగల జెబిఎల్ వృద్ధాశ్రమంలో అవసరమైన వారికి 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ ఆదివారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి నాగ శైలజ మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా గుర్తించి తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్, యువ న్యాయవాది తిరివీధి కృష్ణ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పేదలు, వృద్ధులు, అనాథలు ఉండే ప్రాంతాలను ఎంపిక చేసుకొని మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఉచిత పరీక్షలు, ఉచితంగా మందులు అందించడం ప్రశంసనీయమన్నారు. వివిధ ప్రాంతాలలో సేవా ట్రస్ట్ పేరిట సబ్సిడీపై కళ్లజోళ్లు, శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జెబిఎల్ వృద్ధాశ్రమంలోని సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా కళ్లజోళ్లు అందించినట్లు వివరించారు. నేటి సమాజంలో తల్లిదండ్రులు జీవించి ఉండగానే వారి బిడ్డలు ఆస్తులను కైవసం చేసుకుని, బయటకు గెంటేస్తున్నారని వాపోయారు. అలాంటి సమాజంలో యువ న్యాయవాది తిరివీధి కృష్ణ తన తల్లిదండ్రులను ప్రత్యక్ష దైవాలుగా భావించి, వారి పేరిట సేవా ట్రస్ట్ ఏర్పాటు చేయడంతో పాటు, ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎందరో పేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు కూడా అందించడం అభినందనీయమన్నారు. ఇదే వృద్ధాశ్రమంలో ఎందరో పెద్దల జీవితాలలో వారి వారి పిల్లలతో పడుతున్న అగచాట్లను వింటుంటే హృదయం ద్రవిస్తోందన్నారు. అలాంటి వారికి తాము న్యాయ సేవ పరంగా అండగా ఉన్నప్పటికీ, వైద్య సేవలలో తిరివీధి కృష్ణ చేస్తున్న సేవలు నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. ప్రజలు కృష్ణ చేస్తున్న సేవా మార్గంలో పయనించాలని సూచించారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముసునూరు

అత్యంత వెనుకబడిన పేద విద్యార్థులకు తెలుగు యువత నాయకులు కొండేటి బాబి ఆర్థిక సహాయం అందజేశారు. చదువులో ప్రతిభ చూపుతూ ఎక్కువ మార్కులు సాధించి, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆయన ఒక్కొక్క విద్యార్థికి రూ.5 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా కొండేటి బాబి మాట్లాడుతూ చదువుతేనే సమాజంలో గౌరవం ఉంటుందన్నారు. చదువు వల్ల మంచి స్థాయిలో ఉద్యోగం సంపాదించి పేద ప్రజలకు అండగా నిలవాలని, ఆర్థికంగా లేని విద్యార్థులను గుర్తించి, తన కష్టార్జితంలో కొంత భాగం నూజివీడు, చాట్రాయి, ముసునూరు, ఆగిరిపల్లి మండలాల్లో ఇప్పటి వరకు 75 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు మంచి ఉద్యోగం సంపాదించి, మంచి స్థాయికి వచ్చినప్పుడు మిగిలిన విద్యార్థులకు అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు కొండేటి బాబిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి మారేష్, కారుమంచి రాజు, మోదుగు ముత్తయ్య, గద్దల నాగేసు, మొద్దు శ్రీను, విస్సంపల్లి ప్రసాద్, కల్లెపల్లి మారేశ్వరరావు, విస్సంపల్లి రాజా పాల్గొన్నారు.

విద్యార్థినికి సాయం అందజేస్తున్న కొండేటి బాబి

చికెన్, గుడ్డు తినండి.. ఆరోగ్యంగా ఉండండి

స్టేడియంలో స్నేహ చికెన్ ఆధ్వర్యాన అవగాహన

చికెన్ తింటూ అవగాహన కల్పిస్తున్న పౌల్ట్రీ యజమానులు

ఏలూరు స్పోర్ట్స్ : కోడి మాంసం తినడంపై వస్తున్న వదంతులను నిర్వీర్యం చేసేందుకే చికెన్ మేలాను ఏర్పాటు చేశామని పలువురు పౌల్ట్రీ యజమానులు అన్నారు. ఏలూరు నగరంలోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఆదివారం స్నేహ చికెన్ ఆధ్వర్యంలో చికెన్ మేలా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 'కోడిగుడ్లు, చికెను తినండి-ఆరోగ్యంగా ఉండండి' అన్న నినాదంతో చికెన్‌తో పెద్ద సంఖ్యలో భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ భోజన కార్యక్రమానికి నగరంలోని ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పౌల్ట్రీ యజమానులు మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ అనేది పూర్తిగా జిల్లా మొత్తం వ్యాపించలేదని, తాము నిర్వహిస్తున్న సంస్థల్లో ఉన్న కోళ్లకు ఎటువంటి తెగులు వ్యాపించలేదని వారు స్పష్టం చేశారు. ఒకవేళ తెగులు వ్యాపిస్తుందన్న సందేహం కలిగిన ఆ బ్యాచ్‌ను వదిలివేసి వేరొక బ్యాచ్‌ను సాకుతున్నామని తెలిపారు. కనుక ప్రజలెవ్వరూ అధైర్య పడవలసిన అవసరం లేదని వారు భరోసా ఇచ్చారు. కోడిగుడ్లు, కోడి మాంసం తినండి ఆరోగ్యంగా ఉండండి అన్న నినాదంతోనే ఈ భోజనాలను ఏర్పాటు చేశామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిబిఆర్ హేచరీస్ ప్రయివేట్ లిమిటెడ్, స్నేహ ఫామ్స్ ప్రయివేట్ లిమిటెడ్, వెంకటేశ్వర హ్యాచరీస్ ప్రయివేట్ లిమిటెడ్ ఇలా పలు పౌల్ట్రీ ఫార్మ్ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ రచనలు-ప్రసంగాలపై పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

భారత రాజ్యాంగం సాధించిన ప్రగతి అమలు తీరు, బహుజన వారియర్స్ జీవిత చరిత్రలు, బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రచనలు-ప్రసంగాలు అనే అంశంపై మే 10వ తేదీ శనివారం గుంటూరులో జరిగే పరీక్షలో విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా కో ఆర్డినేటర్ మేతర అజయ్ బాబు తెలిపారు. ఎసిఎఫ్ సంస్థ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్ష కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ పరీక్షలో ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50 వేలు, నాలుగు నుంచి పదవ బహుమతి వరకు రూ.25 వేలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులలో, యువకులలో, మేధావులలో భారత రాజ్యాంగాన్ని ప్రచారం చేసి వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపి, తద్వారా భాద్యతయుతమైన భారతీయ యువతను తయారు చేయటమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలవారు %www.acfassociation.com% వెబ్‌సైట్‌లో అప్లై చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు అప్లికేషన్ అందుబాటులో ఉంటుందని, ఈ పరీక్ష రాసేవారు ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని తెలిపారు. 150 మార్కులకు ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ ఛాయిస్ విధానం పరీక్ష ఉంటుందని, పరీక్షలు మెరిట్ సాధించిన మొదటి వందమంది అభ్యర్థులకు 'మీలో ఎవరు' బహుజన పేరట జరిగే టీవీ షోలో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. అందులో సిలబస్ 10 ప్రశ్నలకు జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ లక్ష రూపాయలు గెలుచుకునే అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 7032686204 గల ఫోన్ నెంబరును సంప్రదించగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేతర అశోక్, కొండేటి ప్రతాప్, గండికోటి రంగారావు, చౌటపల్లి సూర్యం, రవికాంత్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, డైరెక్టర్ అమరేంద్ర

ఆర్‌జియుకెటిలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ మెయింటినెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని 5 వేలకుపైగా రోబోటిక్ ఆపరేషన్స్, 750కి పైగా మెదడు ఆపరేషన్స్, వెయ్యికి పైగా లేజర్ ఆపరేషన్స్ చేసిన శ్రీకర హాస్పటల్ విజయవాడ వారు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గుండె, లివర్, గ్యాస్ట్రిక్, గైనకాలజీ విభాగాలకు సంబంధించినటువంటి ప్రసిద్ధమైన వైద్యులు విచ్చేసి పరీక్ష నిర్వహించి, సలహాలు, సూచనలు ఉచితంగా మందులు అందజేశారు. ఇందులో భాగంగా డైరెక్టర్ అమరేంద్ర కుమార్ వచ్చిన వైద్యబృందంతో చర్చించి, ఆర్‌జియుకెటి క్లినిక్‌లో స్థాపించాల్సిన మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా విద్యార్థినులు తమ ఆరోగ్యం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరంలో క్యాంపస్‌లోని విద్యార్థులు, సిబ్బంది, సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ సంబంధించి దాదాపుగా వెయ్యి మంది వరకు ఈ శిబిరంలో సేవలు ఉపయోగించుకున్నారు. ఈ శిబిరాన్ని ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, డైరెక్టర్ అమరేంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వంశీవర్ధన్, సోమకృష్ణ, అర్చన, ఇంద్ర మోహన్, కె.దివ్య, ఆర్‌జియుకెటి నూజివీడు ఎఒ డాక్టర్ లక్ష్మణ్, క్లినిక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజశేఖరాన్ని గెలిపించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. మండలంలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్ వద్ద పట్టభద్రులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటు పేరాబత్తుల రాజశేఖరంకు వేయాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ రాజశేఖరంని గెలిపించాలని తెలిపారు.


మెమొంటోను అందజేస్తున ఆలయ ఇఒ

చిన వెంకన్నను దర్శించుకున్న కృష్ణతేజ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజ ఆదివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఇఒ ఎన్‌విఎస్ఎన్.మూర్తి ఆయనకు స్వామివారి మెమొంటోను అందజేశారు.

జనసేనలోకి పలువురు

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలోని దేవర గోపవరం గ్రామానికి చెందిన పలువురు వైసిపి నేతలు జనసేనలోకి ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు ఆధ్వర్యంలో ఆదివారం చేరారు. దేవర గోపవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కేశన శ్రీనివాసరావు, ఉప సర్పంచి కందులపాటి మహేష్ కుమార్, వారితో పాటు మరికొంత మంది నేతలు ఎంఎల్ఎ ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. ఈమేరకు ఉంగుటూరు నియోజకవర్గంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో వీరికి పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా సుపరిపాలన అందిస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వానికి, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌కు ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుందని, ఈ తరుణంలోనే కూటమి పార్టీ బలోపేతానికి ప్రజలు కూడా ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం సృష్టించిన వైసిపిని ప్రజలు మాత్రమే కాకుండా సొంత పార్టీ కార్యకర్తలు కూడా నమ్మే పరిస్థితి లేదని అన్నారు. జనసేన మండల అధ్యక్షులు, గ్రామ సర్పంచి, ఉంగుటూరు నియోజకవర్గ జనసేన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, వీకర్స్‌కాలనీ, 1వ వార్డుకు చెందిన కాకర్లమూడి సతీష్ కుమార్ గారి భార్య కాకర్లమూడి వనజ చెందిన ఓరిజినల్ స్థలం దస్తావేజు పోయినది. డాక్యుమెంటు నెం. 4918/2023 గునిపూడి ఎస్.ఆర్.ఒ. గల దస్తావేజు ది. 14-02-2025 తేదిన జిరాక్స్ తీసుకొను నిమిత్తం తాడేపల్లిగూడెంలోని బస్టాండు నుండి తాలూకా ఆఫీసు వైపు వెళ్లుచుండగా మార్గమధ్యములో పడిపోయినది. నా ఒరిజినల్ డాక్యుమెంటు దొరికిన వారు టౌను పోలీసు స్టేషనులో గాని,ఈ క్రింది అడ్రసుకు గాని అందించగలరు.

కాకర్లమూడి వనజ
W/o కాకర్లమూడి సతీష్ కుమార్
తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా
సెల్: 9182851469
8500739998